APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

అనంతపురం | గురువారం 17 సెప్టెంబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 79 | ఎడిటర్ : జిరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-

### ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా

## నటిస్తున్నారు

ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?: జగన్

చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు

ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి

ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ

ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం

హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" - మిగతా3లో




### మక్కాపై డ్రోన్ దాడి యత్నం..

## స్పందించిన భారత్

- మక్కా సమీపంలో డ్రోన్ దాడి యత్నంపై భారత్ ఆందోళన
- దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన సౌదీ అరేబియా
- ఇది ఉగ్రచర్యేనని, రెచ్చగొట్టే ప్రయత్నమని సౌదీ ప్రకటన
- సౌదీ సార్వభౌమాధికారంపై దాడులను ఖండించిన భారత్

## ఏపీలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం

- ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల
- ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యం



**తిరుమల**

రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణమే లక్ష్యమని సీఎం చంద్రబాబు వెల్లడించారు. బుధవారం తిరుమలలో పలు అభివద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్--1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 - మిగతా3లో

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

- భారతీయ సినిమాకు చేసిన సేవలకుగాను ఈ పురస్కారం..
- సెప్టెంబర్ 22న గుజరాత్‌లో అవార్డు ప్రదానం
- అనంత్ నాగ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 300కి పైగా చిత్రాలు, 'మాల్గుడి డేస్'తో దేశవ్యాప్త గుర్తింపు






## మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

- మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే'
- కేంద్రం కీలక ప్రకటన!
- మెటాను ఇక సాధారణ ఇంటర్మీడియరీగా చూడలేమన్న ప్రభుత్వ వర్గాలు
- లీగల్ ఇమ్యూనిటీపై తుది నిర్ణయం న్యాయస్థానాలదేనని వ్యాఖ్యలు



## గత ప్రభుత్వంలో పెట్టిన దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం

- భారతి రెడ్డిపై పోస్ట్ పెడితే మా కార్యకర్తనే జైలుకు పంపా
- మహిళల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడాన్ని సహించబోమన్న లోకేశ్
- భారతి రెడ్డిపై పోస్ట్ పెట్టిన టీడీపీ కార్యకర్తను జైలుకు పంపించానని వెల్లడి
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన లోకేశ్
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్

**అమరావతి**

రాజకీయాల్లో మహిళల వ్యక్తిగత ప్రతిష్ఠను కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ఆ బాధ ఎలా ఉంటుందో తాను ప్రత్యక్షంగా చూశానని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఒక మహిళగా తన తల్లి భువనేశ్వరి అసెంబ్లీలో అవమానానికి గురైనప్పుడు ఎంతటి వేదన అనుభవించారో తనకు తెలుసని, అలాంటి పరిస్థితి మరే మహిళకూ రాకూడదనేదే తన లక్ష్యమని అన్నారు. వైఎస్ భారతి రెడ్డి గురించి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టినందుకు సొంత పార్టీ కార్యకర్తనే జైలుకు పంపించానని లోకేశ్ వెల్లడించారు. రాజకీయాలు, కుటుంబాలు వేరని, తమ పార్టీ మహిళల జోలికి - మిగతా3లో

### లక్ష్యాలు చేరకపోతే

## సమావేశాలెందుకు?



- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు
- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం

**అమరావతి**

రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో - మిగతా3లో




### లింగ సమానత్వ సూచీలో

## 131వ స్థానంలో భారత్

- 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్
- 131వ స్థానంలో నిలిచిన భారత్
- వరుసగా 16వసారి తొలి ర్యాంకు దక్కించుకున్న ఐస్‌లాండ్

## భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

- ఔలీ కొండల్లో ద్రోన్లు, ఆధునిక ఆయుధాలతో డ్రిల్స్
- ఉత్తరాఖండ్‌లో 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు
- డ్రిల్స్‌లో పాల్గొన్న 600 మంది సైనిక సిబ్బంది
- రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన



# తెలుగు స్వరం
సామాన్యుడి గుండె చప్పుడు

## రాయలసీమ
అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా




### భక్తే భావంగా పండుగ చేసుకుందాం..!!



పండుగ భక్తిని చాటాలి... డిజె శబ్దాన్ని కాదు..!"

హిందూపురం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలవాలి.

భక్తి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ప్రశాంతంగా నిమజ్జనాలు నిర్వహించాలి.

హిందూపురంలో...జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్



## మురళి 36 ఏళ్ల ప్రయాణానికి...
# మేయర్ (రాయల్ ) పీఠం గిఫ్ట్..!!

.....రాయల్ మురళికి మేయర్ ఛాన్స్.. సీఎం చంద్రబాబు సానుకూల స్పందన?

.....36 ఏళ్లుగా టీడీపీకి సేవ

.....కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర కార్యదర్శి వరకు ప్రస్థానం

.....పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర

మేయర్ పీఠం బలిజలకు కేటాయిస్తే అవకాశం ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి

.......-సీఎం స్పందనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

......మేయర్ అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం అధిష్ఠానానిదే

.....మేయర్ పీఠం బలిజలకు కేటాయిస్తే తనకు అవకాశం ఇవ్వాలని బాబును కోరిన....రాయల్ మురళి.

**అనంతపురం డెస్క్ సెప్టెంబర్ 16 తెలుగు స్వరం.**

రాబోయే రోజుల్లో అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ పీఠం బలిజ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం వస్తే తనకు అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. గత 36 ఏళ్లుగా పార్టీకి విధేయుడిగా పనిచేస్తూ, కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగిన తన సేవలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది. 36 ఏళ్ల పార్టీ ప్రస్థానం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీతో అనుబంధం కొనసాగిస్తూ, గత 36 సంవత్సరాలుగా పార్టీ ఆదేశాలను శిరసావహిస్తూ - మిగతా3లో



# క్రీడల్లో రాణించే.... యువతకు బెస్ట్ సపోర్టు..!!

......అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్....మ్యాచ్‌ను వీక్షించిన మంత్రి.

...టోర్నమెంట్ సీజన్-3 విజేతగా డ్రాగన్ లెవన్.....విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందించిన మంత్రి.

.....యువతలో క్రమశిక్షణ, పట్టుదల పెంచేది క్రీడలే... మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, సెప్టెంబర్ 16: తెలుగు స్వరం.**

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకార్థం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ధర్మవరం పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో నిర్వహిస్తున్న అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3 ఫైనల్ మ్యాచ్ బుధవారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఆగస్టు 20వ తేదీ నుంచి కొనసాగిన ఈ టోర్నమెంట్ ఫైనల్ పోరును రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొని వీక్షించారు. ఫైనల్ మ్యాచ్‌లో డ్రాగన్ ఠ×, పెనుకొండ జట్లు తలపడగా.. ఇరు జట్ల ఆటగాళ్లు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన డ్రాగన్ లేవన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 239 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పెనుకొండ జట్టు 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. దీంతో డ్రాగన్ లేవన్ జట్టు 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టోర్నమెంట్ సీజన్-3 విజేతగా - మిగతా3లో

# ఎన్నికలొస్తున్నాయని..... దీక్షల డ్రామాలకు తెర లేపారు..!!

....మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

....రాప్తాడులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

....నీ అసమర్ధత వల్లే పేరూరు ప్రాజెక్టు పూర్తి కాలేదన్న పరిటాల సునీత

....సొంత ఊరికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని అసమర్ధుడు ప్రకాష్ రెడ్డి అంటూ విమర్శలు

....వారి వెంట వెళ్లేవారు వాస్తవాలు తెలుసుకోవాలని సూచన




**రాప్తాడు సెప్టెంబర్ 16 తెలుగు స్వరం.**

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు వైసిపి నాయకులు దీక్షల పేరుతో డ్రామాలకు తెరలేపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. రాప్తాడు మండలం, హార్మోని సిటీ సమీపంలో 3కోట్ల నిధులతో నిర్మించిన, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. స్థానిక ప్రజలు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సబ్ స్టేషన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక...తోపుదుర్తి, గొరిదిండ్ల, ముత్తవకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించి ప్రారంభించామన్నారు. రాప్తాడు విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం వల్ల స్థానికంగా విద్యుత్ సమస్యలు ఉండవని అన్నారు. త్వరలో బండమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. ఆలమూరు, వేపకుంట విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరవుతున్నాయని.. ప్యాదిండి, న్యామద్దల, దాదులూరు, కొండపల్లి, సోమలదొడ్డి, మన్నీలలో విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం - మిగతా3లో

# మురళి 36 ఏళ్ల ప్రయాణానికి... మేయర్ (రాయల్ )పీఠం గిఫ్ట్..!!





-మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్నానని రాయల్ మురళి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పార్టీ నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయడానికి కృషి చేశానని వివరించినట్లు తెలుస్తోంది.కార్యకర్త నుంచి రాష్ట్ర కార్యదర్శి వరకు: పార్టీలో సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శి స్థాయికి చేరిందని, ఈ ప్రయాణంలో పార్టీ కోసం అనేక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేశానని రాయల్ మురళి పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ నాయకత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వహించానని ఆయన వివరించినట్లు తెలుస్తోంది.మేయర్ పదవిపై అభ్యర్థన: అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ పీఠం బలిజ సామాజిక వర్గానికి కేటాయించే పరిస్థితి ఏర్పడితే, సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న తనకు అవకాశం కల్పించాలని రాయల్ మురళి ముఖ్యమంత్రిని కోరినట్లు సమాచారం. తన రాజకీయ అనుభవాన్ని, పార్టీ పట్ల ఉన్న విధేయతను పరిగణనలోకి తీసుకుని అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.సీఎం స్పందనపై ఆసక్తి: రాయల్ మురళి చేసిన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఆయన వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో సీఎం స్పందనపై అనంతపురం రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.తుది నిర్ణయం ఎప్పుడు?: మేయర్ పీఠానికి సంబంధించిన తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం, ఎన్నికల ప్రక్రియ మరియు అధికారికంగా ఖరారయ్యే రిజర్వేషన్ తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. బలిజలకు అవకాశం దక్కే పరిస్థితిలో రాయల్ మురళి అభ్యర్థిత్వం ఏ మేరకు పరిగణనలోకి వస్తుందనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా- మంత్రి సవితమ్మ





**కక్ష సాధింపు రాజకీయాలు మా విధానం కాదు**

**సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేశాం**

**మున్సిపాలిటీలో 20 కోట్లతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు**

**పెనుకొండ మున్సిపాలిటీలోని 17, 18వ వార్డుల్లో పర్యటించిన మంత్రి సవిత**

**పెనుకొండ సెప్టెంబర్ 16 తెలుగు స్వరం:** పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు.పెనుకొండ మున్సిపాలిటీ లో 17, 18వ వార్డుల్లో మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అంబేద్కర్ సర్కిల్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను మంత్రి పరిశీలించారు. బస్ షెల్టర్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని మంత్రి పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 1,200 కుటుంబాలకు ఇంటి పొజిషన్ పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టామని, స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ?20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా నిధులతో అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి సవితమ్మ తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.“కేసులు పెట్టడం మా నైజం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మా విధానం కాదు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, అప్పటి మంత్రులు తమ సొంత కార్యకర్తలపైనా కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మేము మాత్రం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నాం” అని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.మేము చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచి, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతాం. ప్రజల కోసం చేసిన పనులే మా బలం. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 5 వ సారి లడ్డు.. గుమ్మనూరు కుటుంబానికే.



**గుంతకల్ సెప్టెంబర్ 16 తెలుగు స్వరం.** అంతపురం జిల్లా గుంతకల్ పట్టణం, పట్టణంలో గల స్థానిక భాగ్యనగర్ కొత్త కొట్టాల, కేకేఎల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో వరుసగా కని విని ఎరగని రీతిలో ఐదవ సారి పార్వతి తనయుడు గణనాథుని, లడ్డూని వేలం పాటలో 20000 రూపాయలకు, జాతీయ మానవ హక్కుల సమితి రాయలసీమ జోనల్ అధ్యక్షులు, మరియు జర్నలిస్ట్ గుమ్మనూరు నాగార్జున కుటుంబ సభ్యులు, ఈ సందర్భంగా గుమ్మనూరు నాగార్జున, గుమ్మనూరు జయ కుమారి, గుమ్మనూరు తరుణ్ కృష్ణ,మాట్లాడుతూ ఈ సంవత్సరంతో వరుసగా ఐదోసారి గణనాథుని యొక్క దివ్య ప్రసాదమైన లడ్డూని దక్కించుకోవడం జరిగిందని, సదా ఆ గణనాథుని సేవలో ఎల్లప్పుడూ ఉంటామని, పార్వతి పుత్రుడైన వినాయకుని చల్లని ఆశీస్సులు మా పైన ఎల్లవేళల ఉండాలని, ఆ గణనాథుని ఆశీస్సుల వల్లే, గత నాలుగు సార్లు, దాదాపుగా 30, 40, 50 వేల రూపాయలలో లడ్డూని దక్కించుకోవడం జరిగిందని, కానీ ఐదోసారి గణనాథుని దివ్య ఆశీస్సుల వల్ల 20వేల రూపాయలకే దివ్య ప్రసాదాన్ని సొంతం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. మరియు ఆ గణనాథుని యొక్క దివ్య ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, అందరూ కలిసిమెలిసి కలిసికట్టుగా, రాగద్వేషాలు లేకుండా, జీవించాలని ఆ గణనాథుని గుమ్మనూరు కుటుంబ సభ్యులు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కేకేఎల్ కమిటీ సభ్యులు హరి, కిట్టు, పరశి, సాయి కుశల్, మంజు, మరియు భక్త మహాశయులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించే....యువతకు బెస్ట్ సపోర్టు..!!

-మొదటిపేజీ తరువాయి

నిలిచింది.ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత డ్రాగన్ ఠ× జట్టుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.1 లక్ష నగదు బహుమతితో పాటు విజేత ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన పెనుకొండ జట్టుకు రూ.50 వేల నగదు బహుమతితో పాటు రన్నరప్ ట్రోఫీని అందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరును కనబరిచిన డ్రాగన్ ఠ× ఆటగాడు ఎం. ప్రశాంత్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించగా, పెనుకొండ జట్టు ఆటగాడు ఆసిఫ్ అన్వర్ ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... క్రీడలు కేవలం శారీరక దారుఢ్యానికే పరిమితం కాకుండా యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించడం ద్వారా క్రీడాకారుల్లో సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. మైదానంలో ప్రతి మ్యాచ్ ఒక కొత్త అనుభవాన్ని, ప్రతి ఓటమి ఒక పాఠాన్ని, ప్రతి విజయం మరింత ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలనే స్ఫూర్తిని అందిస్తుందని అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ముందుకు సాగాలని, క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి గారి స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో ఐక్యత, స్నేహభావం, పోటీతత్వాన్ని పెంచేందుకు దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ క్రీడా కార్యక్రమం ద్వారా యువతలో ఆరోగ్యం, క్రీడలు, సామాజిక బాధ్యతల పట్ల అవగాహన పెరగడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన డ్రాగన్ ఠ× జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన పెనుకొండ జట్టుకు మంత్రి అభినందనలు తెలిపారు. ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఎం. ప్రశాంత్, ఉత్తమ బౌలర్‌గా నిలిచిన ఆసిఫ్ అన్వర్‌తో పాటు టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడిని అభినందించారు. గెలుపు కంటే క్రీడాస్ఫూర్తితో పోటీలో పాల్గొనడం ముఖ్యమని, నిరంతర సాధనతో ప్రతి క్రీడాకారుడు తన లక్ష్యాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, బిజెపి సత్య సాయి జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్, బీజేపీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ కునిగిరి నీలకంఠ, క్రీడాకారులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలొస్తున్నాయని..... దీక్షల డ్రామాలకు తెర లేపారు..!!

-మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ లభించడం వలన పంటల సాగుకు ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. ఇప్పటివరకు రైతులకు సుమారు 11వందల ట్రాన్స్ ఫార్మర్లతో పాటు కండక్టర్ కేబుల్ అందజేశామని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు అధికారులు ఎప్పుడు ఏమి అడిగినా వెంటనే స్పందిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదా చేసుకోవచ్చన్నారు. ఎల్-నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పాటు, ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సమస్య ఉందని అయితే గ్రామాల్లో ఎక్కడ తాగునీటికీ ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక తీసుకొని నీటికి విద్యుత్ కి సమస్య లేకుండా చేస్తున్నారన్నారు. అయితే అధికారంలో ఉండగా ఏమీ చేయని కొందరు నాయకులు ఇప్పుడు జల దీక్షల పేరుతో నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శలు చేశారు. ప్రకాష్ రెడ్డి గత ఐదేళ్లలో పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే పనులు పూర్తి చేసి ఉండి ఉంటే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. అధికారంలో ఉండగా కనీసం సొంత గ్రామానికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని వ్యక్తి ఈరోజు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్యకు ఇబ్బంది లేదన్నారు. హంద్రీ-నీవాతో పాటు పీఏబీఆర్ ద్వారా వీలైనంత చెరువులకు నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరు నీటి విషయంలో, ప్రజలకు మంచి చేసే విషయంలో బాగా పనిచేస్తున్నారో ఆ పార్టీ నాయకులు కూడా ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ప్రజలు అలాంటి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.

## భక్తే భావంగా పండుగ చేసుకుందాం..!!

**హిందూపురం సెప్టెంబర్ 16 తెలుగు స్వరం.**

హిందూపురం గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అన్నారు. హిందూపురంలోని సాయితేజ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీసుల ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ పాల్గొని ఉత్సవ కమిటీ సభ్యులు, యువతకు పలు సూచనలు చేశారు. హిందూపురంలో సాధారణంగా 11వ రోజు నిర్వహించే గణేష్ నిమజ్జనాలను ఏడవ రోజుకే నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, ప్రజలు సమన్వయంతో నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. హిందూపురంతో పాటు పుట్టపర్తి, పెనుకొండ ప్రాంతాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమైన నేపథ్యంలో బందోబస్తు కోసం హిందూపురం నుంచి అదనపు పోలీసు బలగాలను ఇతర ప్రాంతాలకు పంపించినట్లు తెలిపారు. కదిరి నుంచి కూడా సిబ్బందిని అవసరమైన ప్రాంతాలకు కేటాయించినట్లు వెల్లడించారు. నిమజ్జనాలు 11వ రోజు, 15వ రోజు, 18వ రోజు, 21వ రోజు వరకు కొనసాగితే పోలీసు సిబ్బందికి కుటుంబాలతో గడిపేందుకు, వ్యక్తిగత పూజలు చేసుకునేందుకు కూడా సమయం దొరకని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు తమ వ్యక్తిగత సమయాన్ని పక్కనపెట్టి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో జనరేషన్ గ్యాప్ కారణంగా యువతతో కమ్యూనికేషన్‌లో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయని ఎస్పీ తెలిపారు. 16 నుంచి 26 సంవత్సరాల మధ్య వయసున్న యువతకు పెద్దలు తమ అనుభవాల ద్వారా చెప్పే విషయాలను పూర్తిగా అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందన్నారు.మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావంతో యువతకు ప్రత్యేకమైన ప్రపంచం ఏర్పడిందని, ఉత్సవ కమిటీల్లోని పెద్దలు యువతతో స్నేహపూర్వకంగా మాట్లాడి పండుగ నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించాలని ఎస్పీ సూచించారు.పెద్దలు, యువత కలిసి పనిచేస్తే హిందూపురం గణేష్ ఉత్సవాలు రాబోయే సంవత్సరాల్లో మరింత ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవచ్చని అన్నారు. హిందూపురంలో గణేష్ నిమజ్జనాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారని విన్నానని, ఈసారి ప్రత్యక్షంగా చూసే అవకాశం రావడం సంతోషంగా ఉందని ఎస్పీ తెలిపారు. నిమజ్జన వేడుకల్లో డీజేలకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండా సంప్రదాయ కళాకారులు, కళారూపాలను ప్రోత్సహించాలని యువతకు సూచించారు. అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని, శబ్ద తీవ్రత కూడా నిర్దేశిత పరిమితుల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.“పండుగ అనేది భక్తిని చాటాలి.. డీజే శబ్దాన్ని కాదు” అనే సందేశంతో యువత సంప్రదాయాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నిమజ్జన మార్గాలు ఎంచుకోవాలి హిందూ పురంలోని బాబుజీ నగర్, అంబేద్కర్ నగర్, గరిడి ప్రాంతాలతో పాటు పేట రంగస్వామి దేవాలయం వద్ద రహదారులు ఇరుకుగా ఉన్నందున భారీ విగ్రహాల నిమజ్జన ఊరేగింపులకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. సాయంత్రం వేళ విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా ప్రతి విగ్రహం సాయంత్రం 5 గంటలలోపు ప్రధాన రహదారికి చేరుకునేలా యువత ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## కొనతట్టుపల్లి లో డీజేలకు దూరంగా.. గణేశ్ నిమజ్జనం



**సోమందేపల్లి, సెప్టెంబర్16, తెలుగు స్వరం:** మండలంలోని తుంగోడు పంచాయతీ కొనతట్టుపల్లి గ్రామంలో డీజేలకు దూరంగా.. సాంప్రదాయ పద్ధతిలో తప్పేట్లు మధ్య అలావ్ ఆడుతూ బుధవారం గణేశ్ నిమజ్జనం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీతారాముల ఆలయ ధర్మకర్త శివరామిరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకరరెడ్డి లు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ రోజు గణనాథున్ని ఎంత భక్తి శ్రద్ధలతో పూజిస్తామో అదే విధంగా నిమజ్జనం కూడా అంతే భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురవాలని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, రామాంజనేయులు, అశోక్ కుమార్,, గంగాధర్, బాబు, మంజునాథ్, సాయి కుమార్ రెడీ తదితరులు పాల్గొన్నారు.

## “ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర”పై అవగాహన కార్యక్రమం.



**అమరాపురం సెప్టెంబర్ 16 తెలుగు స్వరం :** అమరాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం హెచ్ఐవీ/ఎయిడ్స్పై అవగాహన సదస్సు నిర్వహించారు.వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో “ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర” విస్తృతంగా సాగుతోందిఅని,ఈ యాత్రలో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ మరియు ఐసిటిసి ఆధ్వర్యంలో అవుట్ రిచ్ వర్క్ సభ్యులు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర మరియు ఉపాధ్యాయ సిబ్బంది నేతృత్వంలో 8 ,9 విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పట్టణాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. “హెచ్ఐవీ స్థితి తెలుసుకోవడం ఎంత ముఖ్యమో.. సకాలంలో చికిత్స పొందడం అంతకంటే ముఖ్యం” అనే నినాదంతో ఈ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ అనగానే భయపడాల్సిన అవసరం లేదని, సరైన సమయంలో పరీక్షలు చేయించుకుని వైరస్ స్థితిని తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తద్వారా వైరస్ ఇతరులకు వ్యాపించకుండా జాగ్రత్త పడటంతో పాటు తక్షణమే వైద్య సేవలు ప్రారంభించవచ్చని తెలిపారు. అందుబాటులో అత్యాధునిక ఉచిత చికిత్స కోసం వైరస్ సోకిన వారు అధైర్యపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే యాంటీ రిట్రోవైరల్ థెరపీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు పొందాలని అధికారులు సూచించారు. వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా హెచ్ఐవీ బాధితులు కూడా సాధారణ వ్యక్తులలాగే సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. వివక్ష వద్దు – ఆదరణ ముద్దు అంటూ హెచ్ఐవీ బాధితులను సమాజంలో తక్కువ చేసి చూడవద్దని, వారితో కలిసి మెలిసి ఉండటం వల్ల గానీ, ఒకే చోట కూర్చోవడం వల్ల గానీ ఈ వ్యాధి వ్యాపించదని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల పట్ల చూపే వివక్ష వారిని చికిత్సకు దూరం చేస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ బాధితులకు మానసిక ధైర్యాన్ని అందించాలని కోరారు. గ్లోబల్ లక్ష్యాలైన ‘95–95–95’ సాధనలో భాగంగా, 2030 నాటికి ఎయిడ్స్‌ను పూర్తిగా అంతం చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ ‘మిషన్ ఎయిడ్స్ సురక్ష’ కార్యక్రమాలను వేగవంతం చేసిందని వారు వివరించారు. ప్రజలకు హెచ్ఐవీకి సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా ప్రభుత్వ ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ 1097 కి కాల్ చేసి ఉచిత సమాచారాన్ని, సలహాలను పొందవచ్చని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## సాంప్రదాయ పద్ధతిలో వినాయక నిమజ్జనం

**-- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామాలు**





**సోమందేపల్లి, సెప్టెంబర్ 16, తెలుగు స్వరం :** వినాయక చవితిని ఎంత భక్తి శ్రద్ధలతో మూడురోజులుగా పూజలు చేసి, అదే భక్తితో భజనలు, తప్పేట్లు, తాళమేలాలతో సాంప్రదాయ పద్ధతిలో గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొనతట్టుపల్లి, కేతగానిచెరువు, ముద్దపుకుంట సోమందేపల్లి లో కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జనం ఎలాంటి డీజే లు ఆర్భాటాలు లేకుండా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం చేశారు. గత మూడు రోజులుగా వినాయక మండపాల వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాల, అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం సాంప్రదాయ పద్ధతిలో వినాయక నిమజ్జనం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యానికి పునాది





పిడి డాక్టర్ ప్రమీల

సోమందేపల్లి ప్రాజెక్టు పరిధిలో ఘనంగా 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు

**సోమందేపల్లి సెప్టెంబర్ 16, తెలుగు స్వరం:** పౌష్టిక ఆహారంతోనే ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి పునాది అని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రమీల పేర్కొన్నారు. సమాజంలో పోషకాహారంపై అవగాహన పెంపొందించి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో 9వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని సోమందేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ డాక్టర్ శాంత లక్ష్మి అధ్యక్షతన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీడీ ప్రమీల, సోమందేపల్లి మండల తహసీల్దార్ మారుతి ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ , ఏపీఎం పీహెచ్ఎన్ పార్వతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మరియు మహిళలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు.శరీర ఎదుగుదలకు, కండరాల నిర్మాణానికి, కణజాలాల అభివృద్ధికి మరియు శరీరంలో దెబ్బతిన్న కణజాలాల పునరుద్ధరణకు ప్రోటీన్ ఎంతో ముఖ్యమైన పోషక పదార్థమని పీడీ గారు వివరించారు. పిల్లల శారీరక ఎదుగుదలతో పాటు మెదడు అభివృద్ధికి కూడా తగిన పోషకాహారం అవసరమని తెలిపారు. పప్పులు, కందులు, పెసలు, శనగలు, మినుములు, సోయా వంటి పప్పుధాన్యాలు, పాలు మరియు పాల పదార్థాలు, వేరుశెనగ, బాదం, ఇతర గింజలు వంటి స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో తగిన మోతాదులో చేర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా కేవలం ఒకే రకమైన ఆహారంపై ఆధారపడకుండా బియ్యం లేదా చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పాలు మరియు ఇతర పోషక పదార్థాలతో సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు.గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు గర్భంలోని శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం తీసుకోవాలని, బాలింతలు తగినంత పోషకా హారం తీసుకుంటూ శిశువుకు తల్లిపాలు అందించాలని సూచించారు. చిన్నారులకు వయస్సుకు తగిన విధంగా వివిధ రకాల పోషకాహారాన్ని అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. పిల్లలకు అధికంగా ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్ ఫుడ్, అధిక ఉప్పు, చక్కెర కలిగిన ఆహార పదార్థాలు ఇవ్వకుండా ఇంట్లోనే తయారు చేసే పోషక విలు వలు కలిగిన ఆహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు వివిధ రకాల పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానికంగా సులభంగా లభించే పదార్థాలతో తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగే పోషకాహార వంటకాలను ప్రదర్శించి, వాటిలో ఉండే పోషక విలువలను మహిళలకు వివరించారు. ప్రతి కుటుంబం తమ రోజువారీ ఆహారంలో వైవిధ్యాన్ని పాటించి, “సమతుల్య ఆహారం -- సంపూర్ణ ఆరోగ్యం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. కార్యక్ర మంలో సోమందేపల్లి ప్రాజెక్టు సూపర్వైజర్లు శుభారాణి, నాగరాణి, లలితమ్మ, మంజుల, సోమందేపల్లి మరియు పరిగి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## ఎంపీటీసీ ఎన్నికలనిమిత్తం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్స్ నోటిఫికేషన్‌పై అఖిలపక్ష పార్టీ నాయకులతో సమావేశం...

ఎంపీటీసీ ఎన్నికలకు అఖిలపక్ష పార్టీ నాయకులందరూ సహకరించాలి ఎంపీడీవో పార్థసారథి...



**పుట్టపర్తి డస్క్, నంబుల పూలకుంట, సెప్టెంబర్ 16 తెలుగు స్వరం,** ప్రభుత్వం ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్స్ ప్రచురణ పై అఖిలపక్ష పార్టీ నాయకులకు సమావేశమై ఎన్నికల నిర్వహించే విధి విధానాల పైన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పార్థసారథి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నంబులపూలకుంట మండలంలో ఎంపీటీసీ ఎన్నిక పైన, పోలింగ్ కేంద్రాల వివరాలను ఓటర్ల వివరాల పై అఖిలపక్ష పార్టీ నాయకులతోఎంపీడీవో మాట్లాడి నాయకుల సూచనలు సలహాలు తీసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 15న ఎంపీటీసీ సభ్యులు ఎన్నికల నిమిత్తం పోలింగ్ స్టేషన్స్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. దీంతోపాటు ఈనెల 19న ఎన్నికల కోసం జిల్లా కలెక్టర్ గారి ఆమోదంతో ఎంపీటీసీ ఎన్నికల ఫైనల్ పోలింగ్ కేంద్రాలజాబితాను ప్రకటించడం జరుగుతుంది అని తెలపడం జరిగింది . 29న స్కూల్ కమిటీ సభ్యులు ఎన్నిక జరుగునున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల కన్వీనర్ శ్రీరామల నాయుడు, అఖిలపక్ష పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం స్థల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ...

**అధికారుల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖ అధికారులు ఆదేశాలు....**





**పుట్టపర్తి డస్క్, కదిరి, సెప్టెంబర్ 16 తెలుగు స్వరం** కదిరిపట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ గారు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కదిరి పట్టణంలోని దేవరచెరువు వద్ద నిమజ్జన కార్యక్రమంనిర్వహించనున్న ప్రదేశాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి జాప్యం, లోటుపాట్లు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యంగా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డి.ఎస్.పి ఆదేశించారు. అనంతరం పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదేవిధంగా వినాయక మండపాల నిర్వాహకులు కూడా అధికారులకు పూర్తి సహకారం అందిస్తూ, నిబంధనలను పాటించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి గారు, డీఎస్పీ శివనారాయణ స్వామి ఆర్డీవో ఆవుల కళావతి మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ , విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం భరోసా.. ..

**34 మంది లబ్ధిదారులకు రూ.46.01 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కందికుంటవెంకటప్రసాద్ ...**





**పుట్టపర్తి డెస్క్, కదిరి, సెప్టెంబర్ 16 తెలుగు స్వరం** కదిరి నియోజకవర్గంలో పేద కుటుంబాల్లో అనారోగ్యం కారణంగా ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం గుర్తించి వైద్యానికైనా నగదును. పరిశీలించి వారికి సీఎం సహాయ నిధి నుంచి నగదు చెల్లింపు చెక్కులను అందజేసి వారికి అండగా నిలుస్తోందని కదిరి నియోజకవర్గశాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. పేదల ఆరోగ్యం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బుధవారం కదిరి పట్టణంలోని ఆర్ అండ్ బి వసతి గృహంలో నిర్వహించిన సీఎంసహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 34 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.46,01,038 చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు పెద్ద ఆర్థిక భారంగామారుతున్నాయని అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. పేదల ఆరోగ్యం విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి సహాయాలను అందేలా నా వంతు కృషి చేస్తానుఅని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా పేదలు బలహీన వర్గాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. కదిరిలో రూ.5.95 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కదిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 688 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,95,46,823 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కదిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సవిత



**రొద్దం సెప్టెంబర్ 16 తెలుగు స్వరం:** ఇటీవల మృతి చెందిన రొద్దం మండల టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి వైకుంఠ సమారాధన కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రొద్దం మండలం గోనిమేకలపల్లి గ్రామంలో కురుబ యల్లప్ప వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా రొద్దం మండల మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు అస్వర్త నారాయణ తండ్రి నారాయణప్ప వైకుంఠ సమారాధన కార్యక్రమంలో మంత్రి సవితమ్మ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పెనుకొండ మండలం రాంపురం గ్రామంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు తల్లి, మంత్రి సవితమ్మ పెద్దమ్మ జయమ్మ వైకుంఠ సమారాధన కార్యక్రమంలోనూ మంత్రి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి సవితమ్మ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ప్రార్థించారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881